క్లుప్తంగా

సీబీఎస్ఈ టెన్త్‌లో 'డఫోడిల్స్' ప్రతిభ

నర్సంపేట : సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో పట్టణంలోని డఫోడిల్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం ఫలితాలు విడుదలవగా ప్రతిభ చాటిన విద్యార్థులను చైర్మన్ చింతల సురేందర్, సెక్రెటరీ సాయికీర్తన, హెచ్ఆర్‌డీ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ అజీముద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ రీటా, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అజీముద్దీన్ మాట్లాడారు. ఎస్.అక్షరరెడ్డి 489, సుమప్రియ 463, మనస్విని, సాయితేజ 462, వి.కార్తీక్, సాయిప్రియ 460 మార్కులు సాధించినట్లు తెలిపారు. 69 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 30 మందికి 400కుపైగా మార్కులు వచ్చాయని చెప్పారు.

ఉత్తమ సేవా అవార్డు ప్రదానం



నర్సంపేట : కల్వరి బాప్టిస్టు చర్చి సిల్వర్ జూబ్లీ సందర్భంగా పట్టణానికి చెందిన జన్ను శ్రీనుకు రెవరెండ్ డాక్టర్ పీవీ.రూబెన్ సోమవారం ఉత్తమ సేవా అవార్డు అందజేశారు. తొలుత శ్రీనును శాలువాతో సత్కరించారు. అనంతరం రూబెన్ మాట్లాడారు. శ్రీను సేవలను గుర్తించి అవార్డు అందజేసినట్లు తెలిపారు. శ్రీనును అభినందించారు. శ్రీను గతంలో శ్రీను మదర్ తెరిస్సా జాతీయ అవార్డు, విశిష్ట సేవా రత్న జాతీయ అవార్డు, దళితరత్న జాతీయ సేవా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ అశోక్ సామేల్, చర్చి బాధ్యులు మరియమ్మ, పరికి జ్యోతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి



దుగ్గొండి : పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని నాచినపల్లికి చెందిన జటబోయిన వీరయ్య (70) ఏప్రిల్ 26న ఇంట్లో పని చేస్తుకుంటుండగా నాగుపాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వీరయ్యను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా 18 రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలున్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



రాయపర్తి : మండలంలోని మైలారం శివారులో ఎదురెదురుగా వచ్చిన రెండు బైకులు ఢీకొనగా సీత్యతండాకు చెందిన గుగులోతు మోహన్ తీవ్ర గాయాల పాలయ్యాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందించి 108 అంబులెన్స్‌ను రప్పించి మోహన్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలను దయాకర్‌రావు అడిగి తెలుసుకున్నారు.

పరామర్శ



నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్లా చెన్నకేశవరెడ్డిని అతడి తల్లి పూలమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. పూలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఇద్దరి యువకుల మధ్య ఘర్షణ

ఖిలా వరంగల్: ఇద్దరు యువకులు స్నేహితులు. ఆ ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. వారు ఒకరికి తెలియకుండా మరొకరు ఒకే యువతిని ప్రేమించగా ఆ విషయం ఇద్దరి మధ్య గొడవకు ఆజ్యం పోసింది. సోమవారం ఉదయం రెల్వేగేట్ ప్రాంతంలోని ఓ కాలనీకి చెందిన యువతి విషయమై ఇద్దరూ పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడి విషయం యువతి ఇంట్లో తెలియటంతో ఆగ్రహానికి లోనైన ఆ యువతి సోదరుడు ఓ యువకుడిని కారుతో ఢీ కొట్టగా అతడికి గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. గాయపడిన యువకుడు మిల్స్‌కాలనీ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బాధ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం.

నర్సంపేట : పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్



నల్లబెల్లి : పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట రూరల్ : ముగ్ధుంపురంలో బారులు దీరిన ఓటర్లు



సంగెం: వృద్ధుడికి పూలతో స్వాగతం పలుకుతున్న అధికారులు



పోలింగ్ ప్రశాంతం



సంగెం : తిమ్మాపూర్‌లో బారులు దీరిన ఓటర్లు



రాయపర్తి : పెర్కవేడులో..



దుగ్గొండిలో..

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలోని 283 పోలింగ్ కేంద్రాల్లో పార్లమెంటు పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని బూత్‌ల్లోని ఈవీఎంలు కొంత సేపు మొరాయించినా అధికారులు సరిచేసి ఎన్నికలను కొనసాగించారు. డీసీపీ రవీందర్ పలు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియలో 1350 మంది పోలింగ్ సిబ్బందితోపాటు 23మంది మైక్రో అబ్జర్వర్లు విధుల్లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకోగా మధ్యాహ్నం కొంత తగ్గి సాయంత్రం స్పీడందుకుని సాయంత్రం 5 గంటల వరకు 73 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఓటింగ్ సరళిని మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోరిక బలరాం నాయక్, మాలోతు కవిత, అజ్మీర సీతారాంనాయక్ పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి పరిశీలించారు. నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటు హక్కును వినియోగించుకోడం ప్రత్యేకతను సంతరించుకుంది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్వగ్రామమైన అమీనాబాద్‌లో, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్వగ్రామమైన కేశవాపురంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నల్లబెల్లి మండల కేంద్రంలో ఓటును వేశారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని 26 గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా టౌన్ సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా మహేశ్వరంలోని పోలింగ్ కేంద్రాన్ని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ పరిశీలించారు.

వర్ధన్నపేట : కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణను వేర్వేరుగా సందర్శించి పరిశీలించారు. వర్ధన్నపేటలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పర్వతగిరి : మండలంలోని 45 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఖానాపురం : మండలవ్యాప్తంగా ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఎస్సై రఘుపతి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

చెన్నారావుపేట : మండలంలోని 40 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు బారులు తీరారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏపీఎం ఈశ్వర్ పర్యవేక్షించారు. మండల కేంద్రంలోని 204 పోలింగ్ కేంద్రంలో వర్షపు నీరు నిలవడంతో ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎస్సై గూడ అరుణ్‌కుమార్ ఎన్నికలను పర్యవేక్షించారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సందర్శించారు.

గీసుకొండ : మొగిలిచర్లలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చొరవ చూపారు. పార్టీలు వేరైనా తామంతా ఒకటేనని చాటారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ స్వగ్రామంలో ఓటు వేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధర్మారంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

సంగెం : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వృద్ధులు ఇతరుల సహాయంతో వచ్చి ఓటు వేశారు. చింతలపల్లిలో ఓటింగ్‌ను ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, కాపుల కనిపర్తిలో మామునూర్ ఏసీపీ తిరుపతి పరిశీలించారు. మండలంలో 80 శాతం ఓటింగ్ జరిగింది.

నెక్కొండ : మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నెక్కొండ పోలింగ్ కేంద్రాన్ని మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత సందర్శించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

దుగ్గొండి : మండలంలో 75.08 శాతం పోలింగ్ నమోదయింది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బారులు దీరారు. పోలింగ్ కేంద్రాల ముందు షామియానాలు ఏర్పాటు చేశారు. గిర్నిబావిలో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో 3 కిలోమీటర్ల దూరంలోని మందపల్లి, తొగర్రాయి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేశారు. పొనకల్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య గొడవ జరగడంతో ఎస్సై జక్కుల పరమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు.

నల్లబెల్లి : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నల్లబెల్లి హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుండాల మదన్ కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ రుద్రగూడెం, రాంతీర్థం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

రాయపర్తి : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. మైలారంలో ఓటింగ్ శైలిని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, పెర్కవేడులో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరిశీలించారు. పెర్కవేడు, రాగన్నగూడెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించగా తిర్మలాయపల్లిలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి పరిశీలించారు.



నర్సంపేట రూరల్ : గురిజాలలో బారులు దీరిన ఓటర్లు



పర్వతగిరి : వృద్ధుడిని తీసుకొస్తున్న వలంటీర్



నర్సంపేట : ఓటు హక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లు



చెన్నారావుపేట : లింగగిరిలో..



నర్సంపేట : వృద్ధుడిని తీసుకొస్తున్న వలంటీర్లు



చెన్నారావుపేట : తొలిసారి ఓటేసిన యువకులు



నెక్కొండ : పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత



గీసుకొండ : శ్రేణులతో మాట్లాడుతున్న రేవూరి

బాధిత రైతులను ఆదుకోవాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బుధరావుపేటలో వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. బాధిత రైతులను ఓదార్చి మాట్లాడారు. ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నియోజకవర్గ పరిధిలో భారీగా వరి, ఇతర పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. వరి పంట నేలవాలగా ధాన్యం భారీగా తడిసిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారులతో వెంటనే సర్వే చేయించి బాధిత రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించడంతోపాటు తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, నాయకులు ల్యాదినేని ఎల్లయ్య, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- నేలవాలిన వరి, తడిసిన ధాన్యం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులు, అకాల వర్షాలకు రైతన్నలకు అపార నష్టం వాటిల్లింది. వరి పంట నేలవాలింది. కల్లాల వద్ద ధాన్యం రాసులు తడిసిపోయాయి. ధాన్యం రాసులపై కప్పిన టార్పాలిన్ షీట్లు ఈదురుగాలులకు కొట్టుకపోయాయి.

ఖానాపురం : మండలంలో అకాల వర్షంతో అన్నదాత ఆగమాగమయ్యాడు. రైతులు కోతలు కోసి రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టుకోగా వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. రైతులు బస్తాల్లో నింపిన, ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. కోత దశకు చేరిన వరి పంటలు నీట మునగడంతో రైతులకు కన్నీరు మిగిలింది.

దుగ్గొండి : మండలంలో పలు గ్రామాల్లో వరి పొలాలు నేలవాలాయి. అరటితోటలు విరిగిపోయాయి. బొబ్బరోనిపల్లిలో ధాన్యం తడిసిపోగా రైతులు కల్లాల్లోని ధాన్యాన్ని నీటి నుంచి వేరు చేయడానికి ఇబ్బందులు పడ్డారు. జీడికల్‌కు చెందిన గొర్రె భద్రయ్య, లక్ష్మీపురం గ్రామానికి చెందిన లడె యుగందర్ అరటి తోటలు గాలికి విరిగిపోయి తీవ్రంగా నష్టపోయారు.



ఖానాపురం : తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు వెంకన్న



ఖానాపురం : నేలవాలిన వరి పంట



దుగ్గొండి : బొబ్బరోనిపల్లిలో తడిసిన ధాన్యాన్ని వేరు చేస్తున్న రైతు

ఆర్‌యూబీతో ఇబ్బందులు

- చిరువర్షానికే మూడు ఫీట్లకుపైగా చేరుతున్న వరద నీరు



ఆర్‌యూబీలో నిలిచి వరద నీరు

సంగెం : బాబోయ్.. ఆర్‌యూబీతో ఇబ్బందులు అంటూ మండలంలోని ఎల్గూర్‌రంగంపేట గ్రామ ప్రజలు బెంబెలేత్తిపోతున్నారు. వరంగల్ నుంచి విజయవాడ మధ్యలో చింతలపల్లి వద్ద ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ ఎత్తివేసి కొత్తగా ఆర్‌యూబీ నిర్మించిన విషయం తెలిసిందే. కాగా ఊటనీరు, వరదనీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో చిరువర్షానికి సైతం మూడు ఫీట్లకుపైగా వరద నీరు నిలుస్తోంది. సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలువురు ద్విచక్రవాహనాలు, కార్లలో వచ్చిన ఓటర్లు ఆర్‌యూబీ నుంచి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడడం కనిపించింది. పలు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లలోకి వరద నీరు వెళ్లడంతో అవి మధ్యలోనే ఆగిపోయి నెట్టుకు రాలేక పోలేక ఇబ్బందులు పడ్డారు. ఈ కాస్త వర్షానికే ఇంతగా ఇబ్బంది పడాల్సి వస్తే ఇక భారీ వర్షాలకు అసలు దారి మీదుగా ప్రయాణించలేని పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికైనా రైల్వే, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌యూబీలో వరద నీరు నిలువకుకండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సీతారామచంద్ర ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజ చేస్తున్న భక్తులు

మడికొండ: శ్రీరామనవమి, పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, అనంతరం యాగశాలలో మూలమంత్ర హోమం, రుద్రహోమం చేశారు. శ్రీరాముడిని పెండ్లి కుమారుడిగా తయారు చేసి, సాయంత్రం లక్ష్మీ సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్, రొద్ద దయాకర్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, వెంకన్న, నర్సింహ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



రాయపర్తి : మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన రాసాల యాదయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబానికి సోల్జర్స్ యూత్ అసోసియేషన్, గణపతి యూత్ అసోసియేషన్ సభ్యులు సోమవారం పరామర్శించి బియ్యం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నందనబోయిన సాంబశివ, ఉపాధ్యక్షుడు నందనబోయిన ప్రభుదేవా, కార్యదర్శి వంశీ, ప్రవీణ్, శ్రీకాంత్, సోమరాజు, సాంబరాజు, సాగర్, సాయి, రాజు, మహేష్, రమేష్, నిఖిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి హనుమద్గిరిలో బ్రహ్మోత్సవాలు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 24 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను సోమవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు గంద కృష్ణ మాట్లాడుతూ 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు వార్షిక బహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజు స్వామి వారికి విశేష పూజలు, అర్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు ఉంటాయని తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. భక్తులు సకాలంఓ ఆలయంలో పూజలకు హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనుకుంట్ల రవికుమార్, దశరథకుమార్, గంద్రాతి సుధాకర్, ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారులకు అన్నప్రసాద వితరణ

కాశిబుగ్గ: సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప, సుబ్రహ్మణ్య, ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో హనుమాన్ మాలధారులకు సోమవారం అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూచన ఏకాంబ్రం, దాతలు సోమసుందర్, రాజేందర్, అర్చకులు శ్రీకాంతచారి తదితరులు పాల్గొన్నారు.

అలవేణికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం పరిశోధకురాలు అలవేణికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎఫెక్ట్ ఆఫ్ సర్టెయిన్ పెస్టిసైడ్స్ ఆన్ ది మెటబాలిజం ఆఫ్ ఎ ఫ్రెష్ వాటర్ ఫిష్ చన్న పున్క్టాటస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు.